## మాజీ సిఎం కెసిఆర్‌ను విచారించాలి

- వక్ఫ్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వక్ఫ్ బోర్డులో కార్యాలయ దుర్వినియోగం, తప్పుడు నిర్వహణ, నేరపూరిత వ్యవహారం, అవినీతి తదితర విషయాలపై మాజీ సీఎం కేసీఆర్, ముతావలీ వక్ఫ్ మెంబర్ నిజాముద్దీన్ అక్బర్‌పై సీబీఐ విచారణ జరిపించాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సిఫారసు చేసింది.

బుధవారం హైదరాబాద్ లో మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఆ కమిటీ సభ్యులు, అడ్వొకేట్ డాక్టర్ లుబ్నా సార్వత్, ఏపీ మైనార్టీస్ కమిషన్ మాజీ సభ్యులు అడ్వొకేట్ సయ్యద్ తారీఖ్, ఖాద్రీ తదితరులు కలిసి నివేదికను సమర్పించారు. నిజ నిర్ధారణలో వెల్లడైన విషయాలతో పాటు వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై ఆ నివేదికలో సిఫారసులు చేసినట్టు వారు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

## రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంట సాగుకోసం తెచ్చిన అప్పు తీర్చలేక మనోవేదనతో ఓ రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారంలో బుధవారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన కడారి బక్కన్న (41) గతేడాది మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేశారు.

ఆశించిన దిగుబడి రాకపోవడంతో తీసుకున్న అప్పు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవారు. ఈ క్రమంలోనే ఈనెల 3న గడ్డి మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



## త్వరలో టాప్ 50 స్టార్టప్‌ల గుర్తింపు

- టై హైదరాబాద్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఔత్సాహికవేత్తలు, స్టార్టప్‌లకు మద్దతును అందించే టై హైదరాబాద్ చాప్టర్ అక్టోబర్ 31, నవంబర్ 1న ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌ను ఏర్పాటు చేస్తోన్నట్లు ప్రకటించింది. నగరంలోని హైటెక్స్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి 1500 పైగా ఔత్సాహికవేత్తలు, 100 మంది స్పీకర్లు హాజరు కానున్నారని తెలిపింది. బుధవారం హైదరాబాద్‌లో టై హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజేష్ పగడాల, బోర్డు మెంబర్ అభిషేక్ రెడ్డి కనకాల మీడియాతో మాట్లాడుతూ.. ఈ సమ్మిట్‌లో తెలంగాణలోని టాప్ 50 స్టార్టప్‌ల జాబితాను విడుదల చేయనున్నామని చెప్పారు. ఇందుకోసం 1000 పైగా దరఖాస్తులను జల్లెడ పట్టామని చెప్పారు. ఇందులో అత్యంత కీలకమైన 50 స్టార్టప్‌లను గుర్తించడం ద్వారా వాటికి గుర్తింపు, మెంటర్, ఫైనాన్సియల్ మద్దతు లభించనుందన్నారు. దేశంలో వచ్చే పదేళ్లలో తమ సంస్థ 10 లక్షల మంది ఔత్సాహికులను చేర్చుకోవడం ద్వారా కోటి ఉద్యోగాలను సృష్టించడం ద్వారా.. 100 బిలియన్ డాలర్ల టర్నోవర్‌ను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గతేడాది హైదరాబాద్ స్టార్టప్‌ల నిధుల సమీకరణ 160 శాతం పెరిగిందన్నారు. తాము నిర్వహించబోయే సమ్మిట్‌లో అన్ని రంగాల ఔత్సాహికవేత్తలు పాల్గొననున్నారని వెల్లడించారు.

# ధాన్యం కొనుగోళ్లకు 8,342 కేంద్రాలు

- దిగుబడిలో రాష్ట్రానిది ఆల్‌టైం రికార్డు
- 72 గంటల్లోపు రైతులకు చెల్లింపులు
- సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వానాకాలానికి సంబంధించి 80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం 8,342 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ఆయన వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రం ధాన్యం దిగుబడిలో ఆల్‌టైం రికార్డు సాధించిందని చెప్పారు. 148.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. రూ.23 వేల కోట్లతో కొనుగోళ్లు చేస్తున్నామనీ, రైతులకు కొనుగోలు ప్రక్రియ మొదలయ్యాక 48 గంటల నుంచి 72 గంటల్లోపు చెల్లింపులు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ మొత్తం ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా జిల్లా కేంద్రాల నుంచి కొనుగోలు కేంద్రాల వరకు పర్యవేక్షక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తలెత్తే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుగా టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 1800-425-00333/1967కు కాల్ చేయాలని రైతులకు సూచించారు.

దేశంలోని 29 రాష్ట్రాల్లో, గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంత దిగుబడి రాలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోనే అత్యధిక ఉత్పత్తి సాధ్యమైందని చెప్పారు. కేంద్రాల వద్ద రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం కూడా సరికొత్త రికార్డ్ అవుతుందని మంత్రి చెప్పారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కొనుగోళ్ల కోసం రూ.22 వేల నుంచి రూ.23 వేల కోట్లను వెచ్చించనున్నట్టు తెలిపారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నాలు, 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకాలుంటాయని వెల్లడించారు.

రాష్ట్రంలో 66.8 లక్షల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి అయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. మొత్తం 8,342 కొనుగోలు కేంద్రాలుండగా అందులో 4,259 కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా, 3,517 ఐకేపీ ద్వారా, 566 ఇతర సంస్థల ద్వారా ఉన్నాయని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖాధికారులు సమన్వయం చేసుకుని పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా ముందుగానే రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం తాలుకా వివరాలు నమోదు అయిన 48 గంటల్లో చెల్లింపులు జరిపేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని కోరారు.

మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్‌ను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలో 1,205 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు మంత్రి వెల్లడించారు. కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా చర్యలు చేపట్టడంతో పాటు కొనుగోలుకు సంబంధించిన అన్ని పరికరాలు సమకూర్చుకోవాలని ఆయన ఆదేశించారు. అధికారుల సమన్వయంతో గడిచిన ఎండాకాలం ధాన్యం కొనుగోళ్లలో మంచి ఫలితాలు సాధించారనీ, ఆ అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద అత్యవసరం అనిపిస్తే అదనపు ఖర్చులకు వెనుకడుగు వేయకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. సమయానికి చెల్లింపులు జరిపేందుకు వీలుగా తూకం నుంచి డేటా ఎంట్రీ వరకు సమయపాలన పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్ష సూచనలను పౌర సరఫరాల అధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షం వస్తే ధాన్యం చెడిపోకుండా ఉండేందుకుగాను టార్పాలిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తనతో పాటు పౌర సరఫరాల శాఖా కమిషనర్‌ను సంప్రదించాలని సూచించారు. 24 గంటలు తాను అందుబాటులో ఉంటానని, ఇబ్బందులు తలెత్తితే తనకు ఫోన్ చేయాలని అన్నారు.

**సమన్వయం చేసుకోవాలి :మంత్రి తుమ్మల**

ప్రస్తుత వానాకాలంలో ముందెన్నడూ లేని రీతిలో ధాన్యం దిగుబడి వచ్చిన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రెండేండ్లుగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటేనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, రవాణాశాఖ కమిషనర్ రఘునందన్ రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డిజిపితో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి భేటీ

- సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగా డిజిపి బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డిని రైతు కమిషన్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందజేశారు. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌లో వస్తున్న అసభ్యకరమైన పోస్టులపై ఈ సందర్భంగా డిజిపితో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములునాయక్, భవానీరెడ్డి సుదీర్ఘంగా చర్చించారు.

వ్యక్తులను టార్గెట్ చేసి అసభ్యకరమైన పోస్ట్‌లు, టైటిల్స్, థంబ్ నెల్స్ పెడుతున్నారని తెలిపారు. దానివల్ల ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యున్నత హోదాలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా ఇలాంటి పోస్ట్‌లు పెట్టినట్టు ఉదాహరించారు. పైగా వాటిని యూట్యూబ్‌లో అప్లోడ్ చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఏ వ్యక్తిపై కూడా అసభ్యకరమైన పోస్టులను పోస్టు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరారు.

## ట్రావెల్ ఏజెంట్ ముసుగులో విదేశీ మద్యం

- 54 బాటిళ్లు స్వాధీనం
- ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రావెల్ ఏజెంట్ ముసుగులో విదేశీ మద్యం వ్యాపారం గుట్టును ఎక్సైజ్ అధికారులు బట్టబయలు చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. ఆరులక్షల విలువ చేసే 54 విదేశీ బ్రాండ్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. "హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన సుమీత్ అనే వ్యక్తి ట్రావెల్ ఏజెంట్. పర్యాటకులను విదేశాలకు పంపిస్తున్న క్రమంలో వారిలో కొందరిని ప్రలోభపెట్టి విదేశీ మద్యాన్ని తెప్పిస్తుంటాడు. వాటిని నగరంలోని బడాబాబులకు విదేశీ మద్యం అంటు ఎక్కువ ధరలకు అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటారు. ఈ క్రమంలో విదేశీ మద్యం బాటిళ్లను మూర్తి యుగేందర్ అనే వ్యక్తి టూ వీలర్‌పై బోరబండా ప్రాంతంలో అమ్మకాలు చేస్తుండగా పట్టుకున్నాం" అని హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

# ఉధృతంగా డైలీవైజ్ కార్మికుల పోరాటం

- వర్షంలోనూ కొనసాగిన ఆందోళన




ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల గోడు వినాల్సింది పోయి నిరంకుశంగా కార్మికులను తొలగిస్తూ ఐటిడిఎ పిఒ ఉత్తర్వులు జారీ చేయడం గర్హనీయమని, దాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న డైలీ వైజ్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. ఇందులో భాగంగా సోమవారం 72 గంటల నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఐటిడిఎ పిఒ ఖుష్బూగుప్తా సుమారు 220 మంది కార్మికులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని నిరసిస్తూ బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటిడిఎ ముట్టడి చేపట్టారు. వర్షంలోనూ తడుస్తూ డైలీ వైజ్ కార్మికులు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కార్మికులు కోరేవి గొంతెమ్మ కోరికలు కావన్నారు. హాస్టల్ పిల్లల బాగోగులు చూసుకునే కార్మికులు సమస్యలను పరిష్కరించాలని 72 గంటల ధర్నా చేస్తే టెంట్ వద్ద కరెంట్ కట్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల మొండిగా వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వం అధికారులను ముందు పెట్టి కార్మికులకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులతో కలిసి కమిషనరేట్, సెక్రటేరియట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సిపిఎం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీఐటీయూ జాతీయ కౌన్సిల్ మెంబర్ త్రివేణి, ఆదిలాబాద్ జిల్లా సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కుమురం భీం జిల్లా సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమాచారి, తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీవైజ్, పార్ట్ టైం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, కుమురం భీం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొడసం వసంతరావు, ఆడ శ్యామ్‌రావు, కోశాధికారి మరప రాంబాయి, జిల్లా నాయకులు శ్యామల, పుష్ప, తార, లక్ష్మి, ఈరాబాయి, గిరిజన సంఘం మండల కార్యదర్శి మడావి నాగోరావ్ పాల్గొన్నారు.



## కులవివక్ష వల్లే దళిత ఐపిఎస్ మృతి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హర్యానాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ కులవివక్ష వల్లే చనిపోయారని, ఆయన మారణ వాంగ్మూలం ఆధారంగా హర్యానా డిజిపి, చీఫ్ సెక్రటరీ ఎస్‌పిలను తక్షణమే డిస్మిస్ చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి హైదారబాద్‌లోని ఓయూలో కెవిపిఎస్, ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'పూరన్ కుమార్ మృతి-వ్యవస్థీకృత హత్య' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ ఓయూ ప్రెసిడెంట్ అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడారు. కులవివక్ష అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విచారకరమని, ఈ ఘటన పై తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఐపిఎస్ అధికారిస్థాయిలో ఉన్న దళితుడికే ఇంత అవమానం జరిగితే.. సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతం పేరుతో సమాజాన్ని విషతుల్యం చేస్తున్నాయని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన సంగతి మరవకముందే హర్యానాలో ఐపిఎస్ మృతి దేశంలో అట్టడుగు వర్గాలకు జరుగుతున్న అవమానాలు ఏమిటో చెబుతుందన్నారు. టిపిఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు మాట్లాడుతూ.. ఐపిఎస్ అధికారి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. ప్రధాని ఈ ఘటనపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం ముసుగులో అట్టడుగు దళితులపై దౌర్జన్యాలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పూరన్‌కుమార్‌కు కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆర్ఎల్ మూర్తి, యూనివర్సిటీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తూటి మహేందర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉప్పల ఉదయ్ కుమార్, పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద నవీన్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేదాంత్ మౌర్య, ఎస్ఎస్‌యూ ఓయూ ప్రెసిడెంట్ నవీన్, ఎస్ఎఫ్ఐ, వివిధ సంఘాల నాయకులు శ్రీను, కిరణ్, ఆసీఫ్, సురుచి, మౌనిక, మొక్షిత, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న వెంకట్

## బిసి రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్న బిజెపి

- నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసన
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు పాస్ కాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న జనాభా దామాషా ప్రకారం సమర్థవంతమైనటువంటి సమాచారం తీసుకున్న తర్వాత పార్లమెంట్ చట్టం చేయొచ్చనే సుప్రీంకోర్టు తీర్పు ఉందని అన్నారు. బిసి రిజర్వేషన్ పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రానున్న పార్లమెంట్ సమావేశాల్లోనే బిసి బిల్లు చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఒకపక్క రిజర్వేషన్లకు అనుకూలంగా మాట్లాడుతూనే మరో పక్క రిజర్వేషన్లను అడ్డుకుంటూ విద్వేషాలని రెచ్చగొడుతుందన్నారు. దేశ ప్రజల పట్ల మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మొత్తం జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కుగా ఉన్న విద్యుత్‌ను అదాని, అంబానిలకు అప్పజెప్పడానికి మోడీ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో గత యుపిఎ ప్రభుత్వం 4 శాతం కేటాయిస్తే నేడు బిజెపి ప్రభుత్వం దాన్ని కుదించి 1.3 శాతానికి తీసుకొచ్చారని అన్నారు. వ్యవసాయం లాభసాటి కాదని రైతులను భూమి నుంచి దూరం చేసి, ఆయా భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడం కోసం కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. రైతు పండించిన పంటలకు ఎంఎస్‌పి ప్రకటించాలని, ఉపాధి హామీకి నిధులు పెంచాలని, తదితర సమస్యలపై నవంబర్ 26న దేశవ్యాప్తంగా జరుప తలపెట్టిన నిరసనను జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్, మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, వలమల్ల చంద్రరావు, బోడ అభిమిత్ర, పార్టీ శాఖ కార్యదర్శి బొల్లి లక్ష్మయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**బాల్యమిత్రుడు విష్ణుమూర్తికి నివాళి..**

జూలూరుపాడులో ఇటీవల మృతి చెందిన ఎసిపి సబ్బతి విష్ణుమూర్తి చిత్రపటానికి వెంకట్ పూల మాలవేసి నివాళులర్పించారు. విష్ణుమూర్తి మృతి పట్ల సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తమ్మినేని

## ఇట్టమల్ల ఏసోబు ఆశయసాధనకు కృషి

- సంస్మరణసభలో తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు కమ్యూనిస్టుగా జీవించిన ఇట్టమల్ల ఏసోబు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఖమ్మం మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలకేంద్రంలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సిపిఎం సీనియర్ నాయకులు, చివ్వెంల తొలి ఎంపిపి ఇట్టమల్ల ఏసోబు సంస్మరణసభ నిర్వహించారు. ఏసోబు చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. దోపిడీ వ్యవస్థ పోవాలంటే అది కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రపంచ మానవాళికి విముక్తి కల్పించేది ఎర్రజెండా మాత్రమేనని తెలిపారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న భారత రాజ్యాంగాన్ని మనువాద బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు చెందాల్సిన దేశ సంపద మొత్తాన్ని అంబాని, అదానిలకు బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. అనేక హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలల పాలనలో నేటికీ ఏ ఒక్క వాగ్దానం అమలు కాలేదన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అనుసరించిన వాటినే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించలేదన్నారు. రిజర్వేషన్లకు మొదటి నుంచి బిజెపి వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు.

**జీవితాంతం ప్రజాసేవకు అంకితమైన ఏసోబు : మల్లు లక్ష్మి, చెరుపల్లి సీతారాములు**

తన జీవితాంతం పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషిచేసిన మహానేత ఏసోబు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, సీనియర్ నాయకులు చెరుపల్లి సీతారాములు అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఇట్ట మల్ల ఏసోబు ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా భావించి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పనిచేశారని అన్నారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకుడిగా పనిచేశారని చెరుపల్లి అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. కడవరకు కమ్యూనిస్టుగా బతికిన ఇట్టమల్ల ఏసోబు ఆశయాన్ని ముందుకు తీసుకుపోతామన్నారు.

**మండల కార్యాలయానికి స్థలం వితరణ**

ఇట్టమల్ల ఏసోబు జ్ఞాపకార్థం చివ్వెంల మండలకేంద్రంలో మూడుగుంటల స్థలాన్ని ఆయన కుటుంబ సభ్యులు సిపిఎం కోసం, ప్రజా ఉద్యమాల కోసం అందజేశారు. ఈ స్థలంలో సిపిఎం చివ్వెంల మండల కమిటీ కార్యాలయ నిర్మాణానికి తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రూపొందించిన కడదాక కమ్యూనిస్టుగా బతికిన ఇట్టమల్ల ఏసోబు అనే స్మృతి గీతం ఆడియోను తమ్మినేని వీరభద్రం ఆవిష్కరించారు.




## రైల్వేల్లో పెట్టుబడులకు ఆహ్వానం

- అంతర్జాతీయ రైల్వే సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భారతీయ రైల్వేల్లో ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గడచిన 11 ఏండ్లలో రైల్వేల ఆధునీకరణ, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామనీ, ఇప్పుడు ఆ ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. బుధవారం ఢిల్లీలో రైల్వే మంత్రిత్వ శాఖ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంయుక్తాధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ రైల్వే సదస్సు-2025 సందర్భంగా ఏర్పాటు చేసిన 16వ అంతర్జాతీయ రైల్వే పరికరాల ప్రదర్శన (ఐఆర్ఈఈ)ని ప్రారంభించి, ఆయన మాట్లాడారు. గడచిన 11 ఏండ్లలో దాదాపు 35 వేల కిలోమీటర్ల కొత్త ట్రాక్‌లు, 46 వేల కిలోమీటర్ల రైల్వే లైన్లను విద్యుదీకరించామని తెలిపారు. భారతీయ రైల్వేలు ప్రస్తుతం 156 వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, 30 అమృత్ భారత్, 4 నమో భారత్ సర్వీసులు నడుపుతుందనీ, ఇవి దేశవ్యాప్తంగా బాగా ప్రాచుర్యం పొందాయని చెప్పారు. ఏటా ఏడువేల కోచ్‌లను తయారు చేస్తున్నామనీ, భారతదేశ పురోగతికి ఇవి ప్రత్యక్ష ఉదాహరణలు అని తెలిపారు. ఈ సందర్భంగా భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), గతి శక్తి విశ్వవిద్యాలయ మధ్య ఒక అవగాహన ఒప్పందం జరిగింది. మూడు రోజులు జరిగే ఈ ప్రదర్శనలో పలు అంశాలపై చర్చలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, వ్యాపార సమావేశాలు, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఆస్ట్రియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ సహా మొత్తం 140 దేశాల నుంచి 20 వేలకు పైగా పరిశ్రమ నిపుణులు హాజరవుతున్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దయ్యేవరకు పోరాడుతాం

- పాలకవర్గం కార్మిక పక్షం వైపు ఆలోచన చేయాలి
- ముగిసిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభ
- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక
- రాష్ట్ర అధ్యక్షులుగా పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జనగాం రాజమల్లు




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దయ్యే వరకు పోరాడుతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. లేబర్ కోడ్‌లకు రాష్ట్రంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్.. కేంద్రంలోని బీజేపీకి మద్దతుగా నిలిచాయని, యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభలు బుధవారం విజయవంతంగా ముగిసాయి. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ పట్టణ కేంద్రంలో రాగన్నగూడలోని ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో చలసాని వారి కళ్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమైన మహాసభలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. బుధవారం ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు సీనియర్ కార్మికురాలు దుర్గమ్మ జెండా ఆవిష్కరణ చేశారు. ప్రతినిధులు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. యూనియన్ మూడేండ్ల కాలంలో నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు ఉద్యమాలను నిర్మించేందుకు మహాసభ తీర్మానాలు చేసింది. అనంతరం 130మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. కొంతమంది పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల కోసం పని చేస్తున్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు చెప్పిన విధంగా సమాన పనికి సమాన వేతం, కనీస వేతనం అమలు చేయకుండా బీజేపీ కుట్ర పూరితమైన చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే కార్మికులకు కనీస వేతనం అమలు అవుతుందని ఆశపడి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తే కొత్త సీసాలో పాత సారాయి పోసిన చందంగా ఉందన్నారు. ఏపీలో రూ.21వేల వేతనం సాధ్యమవుతుంటే.. తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. సీఎం దగ్గర ఉన్న 2వ పీఆర్‌సీ ఫైల్‌ను అమోదించాలన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహం చేస్తూ కార్మిక చట్టాలను రద్దు చేస్తోందన్నారు. పారిశుధ్య కార్మికుల పోరాటం అంటే సామాజిక న్యాయ పోరాటమే అని అన్నారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. సీఐటీయూ పోరాటంతోనే కార్మికుల వేతనాలు పెరుగుతాయన్నారు.

**తీర్మానాలు**

'మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ ఉద్యోగ భద్రత కల్పించాలని, షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ డ్రాఫ్ట్ కనీస వేతనాల జీవోలను సవరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు ఇచ్చే జీతాలు జీవో నెంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా నిర్ణయించాలన్నారు. ప్రమాదాల వల్ల మరణిస్తున్న కార్మికులకు రూ. 20 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్మికునికి ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని తీర్మానించారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పీఓఎస్‌హెచ్) 2013ను అన్ని ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల కార్యాలయాల్లో పటిష్టంగా అమలు చేయాలని మహాసభ తీర్మానించింది.

**130మందితో నూతన రాష్ట్ర కమిటీ**

నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షులుగా పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జనగం రాజమల్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాలడుగు సుధాకర్, కోశాధికారిగా అశోక్‌తోపాటు 29 మంది ఆఫీస్ బేరర్స్ 130 మందితో రాష్ట్ర కమిటీని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



దొంతి కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం, మంత్రులు తదితరులు

## ఎమ్మెల్యే మాధవరెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

- ఆయన మాతృమూర్తి చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బుధవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పరామర్శించారు. దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా హనుమకొండ జిల్లా కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పిజిఆర్ గార్డెన్‌లో మాతృ యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగారు. మంత్రి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరాంనాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, యశస్విని రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి రోడ్డు మార్గంలో పీజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ మాతృ యజ్ఞం కార్యక్రమంలో పాల్గొని కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకొని తిరిగి హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, నగర మేయర్ సుధారాణి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్‌జి నుంచి ఎసన్షియల్ సీరిస్

**ముంబయి :** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఎల్‌జి గృహోపకరణాల కోసం కొత్తగా ఎల్‌జి ఎసన్షియల్ సీరిస్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. తమ సంస్థ పబ్లిక్ లిస్టింగ్ తర్వాత ఇది తొలి ఆవిష్కరణ అని పేర్కొంది. వినియోగదారుల రోజూవారీ కలల్ని నెరవేర్చడానికి ప్రతీ ఉత్పత్తి రూపొందించబడిందని పేర్కొంది. ఈ శ్రేణీలో డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్, ఫుల్లీ ఆటోమెటెడ్ టాప్ లోడ్ వాషింగ్ మిషిన్లు, రూమ్ ఎసిలు, కన్వర్టేబుల్ ఓవెన్ ఉత్పత్తులున్నాయని తెలిపింది.

## సామ్‌సంగ్ గెలాక్సీ ఎం17 5జి విడుదల

**హైదరాబాద్ :** సామ్‌సంగ్ తన గెలాక్సీ ఎం17 5జి స్మార్ట్‌ఫోన్ అమ్మకాలను ప్రారంభించినట్లు తెలిపింది. 4జి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ ధరను రూ.12,499గా నిర్ణయించింది. 6జిబి, 8జిబి ధరలను వరుసగా రూ.13,999గా, రూ.15,499గా ప్రకటించింది. 50ఎంపి ట్రిపుల్ రేర్ కెమెరా, 13 ఎంపి సెల్ఫీ కెమెరాతో దీన్ని ఆవిష్కరించింది.

## హైదరాబాద్‌లో మారియట్ బిజినెస్ కౌన్సిల్ 5కె రన్

**హైదరాబాద్ :** మారియట్ ఇండియా బిజినెస్ కౌన్సిల్, తమ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'రోడ్ టు గివ్' 11వ వార్షికోత్సవాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, భాగస్వాములు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ వద్ద వార్మప్ సెషన్ తర్వాత 5కె రన్‌లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం ప్రచారంలో భాగంగా 10,000 మందికి పైగా ఉద్యోగులు రన్, వాక్, సైకిల్ వంటి కార్యకలాపాలలో పాల్గొని స్ఫూర్తిని చాటరని మారియట్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ ఛైర్మన్ సంజయ్ గుప్తా తెలిపారు.

## టి కాలేజ్ డేస్ 'ఎడ్యుకేషన్ ఫెయిర్' ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే తెలుగు విద్యార్థుల కోసం టీ కాలేజీ డేస్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించారు. బాచుపల్లిలోని గోకరాజ్ రంగరాజ్ ఫార్మ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈ ఫెయిర్‌కి 12 దేశాల నుంచి 45 మంది ప్రతినిధులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. విదేశాలలో ఫార్మా ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు ఇది మంచి సదా అవకాశమని టీ కాలేజ్ డేస్ డైరెక్టర్ సంతోష్ గుప్తా, సంజయ్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అనేక మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని ఆయన తెలిపారు. అనేకమంది విద్యార్థుల్లో కొన్ని అపోహలు ఉన్నాయని వాటిని తొలగించేందుకే ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

## శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి సర్వేలు కీలకం

### డాక్టర్ అరవింద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ : సమగ్ర శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి సర్వేలు కీలకమని ఎన్ఎస్‌టిఎంఐఎస్, విజ్ఞాన సాంకేతిక శాఖ సలహాదారులు, హెడ్ డాక్టర్ అరవింద్ కుమార్ తెలిపారు. భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన సాంకేతిక సర్వే 2024-25పై బుధవారం హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. విజ్ఞాన సాంకేతిక శాఖ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ అభివృద్ధికి మార్గదర్శకంగా, విధాన పరమైన ప్రధాన సంస్థగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. హెచ్‌సి రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ రాధాకిశోర్ పాండ్రంగి మాట్లాడుతూ.. విజ్ఞాన సాంకేతిక శాఖ శాస్త్ర అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో అద్భుతంగా పని చేస్తుందన్నారు. విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రధాన బాధ్యతలలో ఒకటి పరిశోధన, అభివృద్ధి పెట్టుబడులపై సమగ్ర సర్వేలు నిర్వహించడమని ఎన్ఎస్‌టి ఎంఐఎస్, విజ్ఞాన సాంకేతిక శాఖ సైంటిస్ట్ డాక్టర్ రబీంద్ర కుమార్ పాణిగ్రాహి పేర్కొన్నారు.

## జన చైతన్య వెంచర్‌లో పార్కు ఆక్రమణలను తొలగింపు

- 19,878 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా
- రూ.139 కోట్ల విలువైన భూమి స్వాధీనం,ఫెన్సింగ్ ఏర్పాటు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి పరిధిలోని ఉప్పరపల్లి జనచైతన్యలో పార్కులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను బుధవారం హైడ్రా అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లో ఆక్రమణలకు గురైన నాలుగు పార్కులకు హైడ్రా విముక్తి కల్పించింది.

19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ 1,2 పేరుతో హుడా అప్రూవల్‌తో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్‌లో పార్కులు కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జాలు జరిగినట్టు హైడ్రా నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం ఉదయం జేసీబీల సాయంతో కబ్జాలను తొలగించింది. ప్రహరీలు నిర్మించుకుని వేసిన షెడ్డులను, రూమ్‌లను తొలగించారు. మూడు వేలు, వెయ్యి గజాలు, అయిదు వందల గజాల చొప్పున ఆక్రమించి నిర్మించిన షెడ్డులను నేలమట్టం చేశారు. ఆక్రమణల తొలగింపు తర్వాత వెంటనే ఫెన్సింగ్ నిర్మాణ పనులను హైడ్రా చేపట్టింది. కబ్జాదారుల నుంచి పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రాధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి తరహాలోనే ఆనాడు బిఆర్ఎస్ ఓటుచోరీ చేసింది

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి తరహాలోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ కూడా ఓటుచోరీకి పాల్పడిందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఓటుచోరీ చేస్తున్నాయని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కర్ణాటకలో జరిగిన ఓట్‌చోరీపై రాహుల్‌గాంధీ అన్ని ఆధారాలను బహిర్గతం చేశారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ వ్యవహారం పులిని చూసి నక్కవాత పెట్టుకున్నట్టు ఉందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ సర్కారు అధికారంలో ఉందనీ, అప్పుడు కాంగ్రెస్ ఓటుచోరీకి ఎలా పాల్పడిందో కెటిఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో ఓటర్ల జాబితాలో అనేక తప్పిదాలు జరిగాయని తెలిపారు.




## చదువుకోని జ్ఞానవంతుడు చుక్కా సత్తయ్య

ప్రజాశక్తి - కల్చరల్

ప్రాథమిక విద్య స్థాయి కూడా సరిగా లేని చుక్కా సత్తయ్య చదువుకోకున్నా జ్ఞానవంతుడు అని రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు ఒగ్గు కథలను చెప్పటం లో ఆరితేరిన సత్తయ్య వేలాది కథలు చెప్పి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చే అవార్డ్ లు రివార్డ్ లు అందుకున్నారు అని చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా మారుతి కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా చుక్కా సత్తయ్య యాది లో సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా సిరికొండ మధుసూదనాచారి పాల్గొని మాట్లాడుతూ పదునాలుగు ఏళ్ళ వయసు లో తెలంగాణ జానపద కళా రూపమైన ఒగ్గు కథ ను ఆరు దశాబ్దాలు పైగా వివిధ ప్రాంతాలలో చెప్పి విశ్వవ్యాప్తి చేసిన వారు సత్తయ్య అన్నారు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్ డీ పట్టా పొందిన తెలుగు విశ్వవిద్యాలయం లో ఆచార్యులు గా పని చేయటం విశేషం అన్నారు నాటి ముఖ్య మంత్రి యెన్ టి ఆర్ చే ప్రశంస పొందిన సత్తయ్య కథలు దేవతల అధ్యాత్మిక సంబంధం కలిగి ఉన్నవి అని వివరించారు ఆయన కథలు తెలంగాణ మాండలీకం నిజాయితీ తో కూడి భావం సామాన్య ప్రజలకు అర్థం అయ్యే రీతిలో ఉంటాయి అన్నారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ గాయని రమా దేవి పాల్గొన్నారు.



## పవర్ మెక్ ప్రాజెక్ట్స్‌కు భెల్ భారీ ఆర్డర్

- రూ.2,500 కోట్ల కాంట్రాక్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

విద్యుత్, మౌలిక వసతుల రంగంలోని పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (పిఎంపిఎల్) తాజాగా భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) నుంచి భారీ ఆర్డర్‌ను సాధించినట్లు వెల్లడించింది. మంచిర్యాల్ సమీపంలో సింగరేణి కాలరీస్ కంపెనీ నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ కోసం భెల్ నుంచి రూ.2,500 కోట్ల విలువైన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇపిసి) ఆర్డర్‌ను సొంతం చేసుకున్నట్లు ఆసంస్థ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌లో కోల్, బయోమాస్ హ్యాండ్లింగ్ సిస్టమ్, యాష్ హ్యాండ్లింగ్ సిస్టమ్, యుటిలిటీస్, ఇండ్యూస్డ్ డ్రాఫ్ట్ కూలింగ్ టవర్ (ఐడిసిటి), వాటర్, వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్, సంబంధిత సివిల్, స్ట్రక్చరల్ పనులు, ఎలక్ట్రికల్, కంట్రోల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి పనులు ఉన్నాయి.

"ఈ భారీ ఆర్డర్ మా ఆర్డర్ బుక్‌ను మరింత బలోపేతం చేస్తుంది. ఇది మా కంపెనీ ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ సామర్థ్యాలను మరింత బలపరుస్తుంది. మా వ్యూహాత్మక వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. అదే విధంగా నమ్మకమైన థర్మల్ పవర్ ద్వారా దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, దీర్ఘకాలిక ఇంధన భద్రతను నిర్ధారించడం వంటి దేశవ్యాప్త లక్ష్యాలతో ఈ ప్రాజెక్ట్ సమన్వయం కలిగి ఉంటుంది." అని పిఎంపిఎల్ సిఎండి సజ్జా కిశోర్ బాబు తెలిపారు. ఈ ఆర్డర్ పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు ఒక మైలురాయిగా నిలువడంతో పాటుగా దేశ మౌలిక వసతుల రంగంలో కీలక పాత్ర పోషించనుందన్నారు.

## మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తికి ఘననివాళి

- పాల్గొన్న తెలంగాణ సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేఘా కృష్ణారెడ్డి మాతృమూర్తి పురిటిపాటి విజయలక్ష్మికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నెల 5న విజయలక్ష్మి తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె సంస్మరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగింది.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బండి సంజయ్, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి ఆర్ రఘురామకృష్ణంరాజు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీలు సీఎం రమేష్, కే.రఘువీర్‌రెడ్డి, డీకె అరుణ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, సినీ నటులు కొణిదెల చిరంజీవి, దగ్గుబాటి వెంకటేష్, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, ఏపీ జితేందర్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్, తెలంగాణ హోమ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి సీవీ ఆనంద్, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, మై హోమ్ గ్రూప్ సంస్థల ఛైర్మెన్ జూపల్లి రామేశ్వరరావు, వైఎస్ఆర్ సీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్ రెడ్డి తదితర ప్రముఖులు విజయలక్ష్మికి నివాళులర్పించారు. ఎంఈఐఎల్ సీఈఓ పీవీ సుబ్బారెడ్డి, కుమార్తె ప్రసన్న, సోదరుడు పీపీరెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ రంగాలకు చెందిన అధికార, అనధికార ప్రముఖులు మేఘా సంస్థ అధికారులు, సిబ్బంది విజయలక్ష్మికి నివాళులర్పించారు.



## బిజెపి కార్పొరేటర్ ఇంట్లో పేకాట

- కార్పొరేటర్ భర్తతో పాటు 10 మంది అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నగరంలోని సుబేదారి కనకదుర్గ కాలనీలోని బిజెపి కార్పొరేటర్ గుజ్జుల వసంత ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కార్పొరేటర్ భర్త గుజ్జుల మహేందర్ రెడ్డితో సహా ముగ్గురు మహిళలతో కలిపి మొత్తం పదిమందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.60 వేలు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని సుబేదారి పోలీస్ వారికి హ్యాండ్ ఓవర్ చేశారు.

## సునీతకో న్యాయం.. నవీన్‌కో న్యాయమా?

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగం : ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునిత పట్ల కక్ష్య పూరితంగా వ్యవరిస్తున్న అధికారులు.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పట్ల చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రచారంలో బాగంగా కరపత్రాలు పంచితే సునిత కూతురుతో పాటు పలువురిపై కేసులు పెట్టిన ఎన్నికల సంఘం, ఫేక్ ఓట్ల వ్యవహారంలో ఒక్క నవీన్ యాదవ్ పైనే కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సునీతకో న్యాయం.. నవీన్‌కో న్యాయమా అంటూ ప్రశ్నించారు. సునీత తన భర్త మరణంపై పెట్టిన కంట తడిని కూడా కాంగ్రెస్ మంత్రులు కామెంట్లు చేయడం దుర్మార్గమన్నారు. సునీతను అవమానించిన పొన్నం ప్రభాకర్‌కు మహిళా కమీషన్ నోటీసులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. వెంటనే మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు ప్రవీణ్ యాదవ్ కు 3 ఓట్లు ఉంటే, తెలంగాణ ఎన్నికల కమీషన్ ఎందుకు కేసు నమోదు చేయడం లేదు?

# బిటి-2 పత్తి దిగుబడులపై రైతుల ఆందోళన

- గులాబీ రంగు పురుగు ఉధృతి
- సిసిఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరుసగా కురిసిన వర్షాలు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. అంతేకాదు బిటి-2 పత్తిపై గులాబీ పురుగు ఉధృతి కనిపించడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. బిటి-1, బిటి-2 టెక్నాలజీతో మార్కెట్‌లోకి వచ్చిన పత్తిలో కాయతొలుచు పురుగు రావడం మహాడేంజరే.. కాయతొలుచు పురుగు రాకుండా జీన్ టెక్నాలజీతో బిటి-1, బిటి-2 పత్తి విత్తనాలను రూపొందించారు. తాజాగా బిటి-2 పత్తి విత్తనాల సాగు మాత్రమే ఉమ్మడి వరంగల్ జిల్లాలో గణనీయంగా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిటి-2 పత్తి చేలల్లో గులాబీ రంగు పురుగు దాడి ఉధృతమవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' బృందం హన్మకొండ జిల్లా నడికూడ, ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామాలను సందర్శించి పత్తి పంటలను పరిశీలించగా, వర్షాలతో చెట్టుకు 15కాయలు నల్లబారి కుళ్లిపోయి కనిపించాయి.

గతేడాది ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ ఏడాది ఐదు లక్షలా 10వేల ఎకరాల్లో పత్తిని సాగైంది. అదనంగా 10,572 ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం పెరిగింది. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గతేడాదితో పోల్చితే తగ్గింది. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో మాత్రం గత ఏడాది కంటే పత్తి సాగు పెరిగింది.



**వరుస వర్షాలతో కుళ్లిన పత్తి కాయలు**

నడికూడ మండలం కౌకొండ గ్రామంలో పత్తి చేన్లలో నీరు నిలిచిపోయి, కాయలు పగిలి పత్తి తడిసింది. పత్తి ప్రతి చెట్టుకు 10-15 కాయలు కుళ్లిపోయి నలుపురంగులోకి మారాయి. ఇదే పరిస్థితి ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లిలోనూ కనిపించింది. దీని ప్రభావం దిగుబడిపైనా ఉండనుంది. పలు ప్రాంతాల్లో పత్తిచేను గిడసబారి కాయలు పెద్ద సంఖ్యలో కాయలేదు. కొన్నిచోట్ల కాసినా.. కాయలు పగిలి కుళ్లిపోయి కాయకుళ్లు తెగులు వచ్చింది. ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లిలో బీటీ-2 పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్టు రైతులు తెలిపారు. గులాబీ రంగు పురుగు రాకూడదని శాస్త్రవేత్తలు అంటున్నారు.

**తగ్గనున్న దిగుబడులు**

2020-21లో ఉమ్మడి జిల్లాలో 32.56 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు రాగా, 2021-22లో కేవలం 12.19లక్షల క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. 2022-23లో 11.37లక్షల క్వింటాళ్లు, 2023-24లో 29.63లక్షల క్వింటాళ్లు, 2024-25లో 40.50లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వచ్చాయి. వాస్తవానికి సాధారణ పరిస్థితుల్లో ఎకరాకు 10-12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. పంట బాగుంటే దిగుబడి 15 క్వింటాళ్ల వరకు వస్తుంది. ఈ ఏడాది వర్షాలు వరుసగా కురవడంతో 2-3 క్వింటాళ్ల మేరకు దిగుబడులు తగ్గనున్నట్టు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఎర్ర చెల్క నేలల్లో పత్తి గణనీయంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో మొక్కజొన్న విత్తడానికి రైతులు సన్నద్ధమైనట్టు అధికారులు చెబుతున్నారు.

**గులాబీరంగు పురుగుతో సగం దిగుబడే.. : గిరుక సంపత్, ఒంటిమామిడిపల్లి**

10-15 రోజుల నుండే చేన్ల గులాబీ రంగు పురుగు కనపడుతాంది.. వరుసగా వర్షాలు పడి ప్రతి చెట్టుకు 10-15 కాయలు కుళ్లిపోయి దిగుబడికి నష్టమైతాంటే.. మళ్లీ ఈ గులాబీ రంగు పురుగుతో దిగుబడి సగం తగ్గినట్టే.. ఇప్పటికే వంద రోజుల చేను ఇది. మరో 30 రోజులు ఈ చేను కాపాడుడు కష్టమేననిపిస్తాంది.

**ఈసారి నష్టపోయినట్టే.. : ఓదెల శ్రీలత, కౌకొండ**

వర్షాలు వరుసగా పడుతాంటే చేన్ల కలుపు తీసుడు కూడా కష్టమైతాంది. ఈ వర్షాలతో కాయలు బుడ్డిపోయినయ్ నల్లగా మారి దూది పింజ కుళ్లిపోయి దిగుబడి తీవ్రంగా పడిపోయింది. ఈసారి పత్తితో నష్టపోయినట్టే.

**శాస్త్రవేత్తలతో పర్యటిస్తాం : డిఎఓ రవీందర్‌సింగ్, హన్మకొండ**

బీటీ-2 పత్తి చేన్లలో గులాబీ రంగు పురుగు రావడంపై వెంటనే వరంగల్ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖాధికారులతో సంయుక్త క్షేత్ర సందర్శన నిర్వహిస్తాం. పత్తి చేన్లను పరిశీలించాక రైతులకు సూచనలు చేస్తాం.